## క్లుప్తంగా

### డిప్యూటీ సీఎంను కలిసిన అదనపు కలెక్టర్

**ఖమ్మం సహకారనగర్:** ఇటీవల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందించారు.

### పీసీసీ చీఫ్‌కు కృతజ్ఞతలు

**కామేపల్లి :** తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రాంరెడ్డి గోపాల్‌రెడ్డి చైర్మన్‌తో పాటు ఇతర సభ్యులతో కలిసి గురువారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రైతులకు సేవ చేసేందుకు తమకు అవకాశం కల్పించడం పట్ల మహేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలు చేస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, గురుస్వామి వలరాజు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజ, హోమగుండం పూజలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురుస్వామి నారాయణంభూద్రి,భాస్కర్ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించి పూజలు చేశారు.

### రైతు కుటుంబానికి గ్రామస్తుల సహకారం



ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

**కామేపల్లి:** మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన చింతల లింగస్వామి ఆయన కుమారై కావేరి గత నెల 22న పిడుగుపాటుకు గుర్రై తండ్రీకుమార్తై మృతి చెందారు. లింగస్వామి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులంతా కలిసి రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని గురువారం బాధిత కుటుంబానికి అందించారు.

### శిక్షణ తరగతులు

**ఖమ్మం సహకారనగర్:** న్యూ ఇరా పాఠశాలలో గణిత ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహించినట్లు న్యూ ఇరా పాఠశాల చైర్మన్ ఐవీ రమణారావు తెలిపారు. గణిత విజ్ఞాన ఖని, మహాగణిత ఉపాధ్యాయులు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి ద్వారా జీవన సాఫల్య పురస్కారం అందుకున్న వంకరాజు శ్రీనివాసమూర్తిచే శిక్షణ ఉంటుందన్నారు. ఈమేరకు గురువారం పాఠశాలలో శ్రీనివాసమూర్తిని ఘనంగా సన్మానించారు. అకాడమిక్ క్వాలిటీ మేనేజర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 108లో ప్రసవం

**తిరుమలాయపాలెం:** పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణికి 108 సిబ్బంది వైద్య సేవలందించి కాన్పు చేశారు. గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జల్లెపల్లి గ్రామానికి చెందిన పందిరి దివ్య అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి కాల్ చేశారు. దీంతో 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ అంబాల రాణి, పైలెట్ లింగయ్యలు వాహనంలో తరలిస్తుండగా.. నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది వైద్య సేవలందించారు. ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. తదుపరి వైద్య సేవల కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

### నియామకం

**నేలకొండపల్లి:** తెలంగాణ ప్రభుత్వం అనాసాగారం గొర్రెల సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎడ్ల తిరపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీరామకృష్ణ గొర్రెల మేకల పెంపకందారుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించి ఎన్నుకున్నారు. మొత్తం 65 మంది సభ్యులలో అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా నరసింహారావు, బ్రహ్మం, వెంకటనారాయణ, పిచ్చమ్మ, ఆదిలక్ష్మిలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కిషోర్ ప్రకటించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**నేలకొండపల్లి:** బైక్ అదుపుతప్పి భార్యభర్తలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ మండల కేంద్రానికి చెందిన జానకిరాములు, రజితతో పాటు ఓ పాప కలిసి గురువారం బైక్‌పై ఖమ్మం నుంచి హుజుర్‌నగర్ వెళ్తున్నారు. అయితే మండలంలోని పైనంపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నుంచి స్పీడ్ బ్రేకర్ దాటుతుండగా.. ప్రమాదవశాత్తు కిందపడ్డారు. దీంతో భార్యభర్తలకు గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు.

# ‘సర్వే’లో సమన్వయ లోపం..



కేఎంసీ సమావేశ మందిరంలో సమావేశమైన అధికారులు

**ఈబీల కేటాయింపుల వద్దే కేఎంసీ అధికారులు**

- చేతులెత్తేస్తున్న ఎన్యూమరేటర్లు
- ఇంటి నంబర్ ఉంటేనే స్టిక్కర్లు
- బయట 70 శాతం పైగా స్టిక్కరింగ్
- కేఎంసీలో ఇంకా ప్రారంభానికి నోచుకోని పలు ప్రాంతాలు

**ఖమ్మంమయూరిసెంటర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే ప్రక్రియలో మొదటి దశ అయిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ 70 శాతం పైగా పూర్తి కాగా.. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20 శాతం కూడా పూర్తి కాలేదు. నగరంలో మొత్తం 965 ఎన్యూమరేటర్ బ్లాక్‌లు గుర్తించగా.. 200 ఎన్యూమరేటర్ బ్లాక్ (ఈబీ)ల్లో గురువారం సాయంత్రం వరకూ స్టిక్కరింగ్ కార్యక్రమమే ప్రారంభం కాలేదు. ఈబీలు గుర్తించిన అధికారులు వాటికి ఎన్యూమరేటర్లను కేటాయించడంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లు తెలుస్తోంది. సమన్వయ లోపంతో సర్వే ప్రారంభదశలోనే తీవ్ర జాప్యం ఏర్పడింది. కేఎంసీ అధికారుల ఇప్పటివరకు మూడుసార్లు ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఈబీలను మారుస్తుండడంతో పలువురు ఎన్యూమరేటర్లు తాము పని చేయలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో కేఎంసీలో సర్వే ప్రారంభ ప్రక్రియ ఆదిలోనే హంసపాదు అన్నచందంగా ఉంది.

**ఇంకా కేటాయింపుల వద్దే..**

జిల్లా వ్యాప్తంగా ఎన్యూమరేటర్లకు ఈబీలు కేటాయించి సర్వే ప్రారంభించగా.. కేఎంసీలో మాత్రం ఇంకా కేటాయింపులే కొనసాగుతున్నాయి. కేఎంసీలో సర్వే కోసం మెప్మా ఆర్పీలు ఎస్‌హెచ్‌జీ సభ్యులను, ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీలను, వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఆశాలను, విద్యా శాఖ ఎస్‌జీటీ టీచర్లను వినియోగించుకోవాలని అధికారులు నిర్ణయించారు. వీరందరి సమన్వయంతో సర్వే చేయాల్సి ఉండగా.. ఈబీలకు ఇష్టానుసారంగా ఎన్యుమరేటర్లను కేటాయించడం, మరలా మారుస్తుండడంతో సర్వే చేసేందుకు ఎన్యూమరేటర్లు ముందుకురావడం లేదు. కేఎంసీలో బుధవారం స్టిక్కరింగ్ చేసేందుకు వచ్చిన వారు గురువారం రాకపోవడంతో వారి స్థానంలో కొత్త వారికి బాధ్యతలు అప్పగించారు. కాగా, వారు తమకు నచ్చిన ప్రాంతాల్లో చేస్తామని చెబుతుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

| | |
|---|---|
| మొత్తం ఇళ్లు | 1.45 లక్షలకు పైగా... |
| ఇప్పటి వరకు స్టిక్కర్లు వేసిన ఇళ్లు | 23,157 |
| సర్వే మొదలైన ఎన్యూమరేషన్ బ్లాక్‌లు | 536 |
| సర్వే ప్రారంభం కాని బ్లాక్‌లు | 429 |

**అనుభవంలేని వారిదే పెత్తనం**

కేఎంసీలో సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్ల నియామకం, వారికి ఈబీలను కేటాయించే ప్రక్రియను కొంతమంది అధికారులకు, సిబ్బందికి కేటాయించారు. వీరు అవగాహన లేకుండా ఈబీలను కేటాయిస్తుండడం, పైరవీలు చేయించుకున్న వారికి.. వారికి నచ్చిన ఈబీని కేటాయించడం చేస్తున్నారు. కొంత మంది సూపర్ వైజర్లు (బిల్ కలెక్టర్లు)కు ఒక్కొక్కరికి 15 నుంచి 20 ఈబీలను కేటాయించగా.. మరికొంత మందికి 40 నుంచి 50 వరకు కేటాయించారు. దీంతో సర్వే ప్రక్రియ ఎలా పర్యవేక్షించాలి అని ప్రశ్నిస్తున్నారు.



కేఎంసీలో వేచి ఉన్న ఎన్యూమరేటర్లు

**ఇంటి నంబర్ లేకపోతే అంతే..**

హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేయాలని, ఆ ఇంటిలో ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటే అన్ని స్టిక్కర్లు వేయాలని ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నారు. అయితే బుధవారం నుంచి ప్రారంభమైన స్టిక్కరింగ్ (హౌస్ లిస్టింగ్) కార్యక్రమంలో ఇంటి నంబర్ లేని ఇళ్లకు ఎన్యూమరేటర్లు స్టిక్కర్లు వేయడం లేదు. ఇలా నగరంలోని ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో జరగగా.. తమ ఇంటికి ఎందుకు స్టిక్కర్ వేయరని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఎన్యూమరేటర్లకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే చర్చ కేఎంసీ జరుగుతోంది. కాగా, కేఎంసీ పరిధిలో సమగ్ర సర్వే విషయమై లోపాలు బయటపడడంతో అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

### పూర్తయిన హౌజ్ లిస్ట్ సర్వే..

**రఘునాథపాలెం:** కులగణన సర్వేలో భాగంగా ముందస్తుగా చేపట్టిన హౌస్‌లిస్ట్ సర్వే మండలంలో పూర్తయింది. మొత్తం 40 గ్రామ పంచాయతీల పరిధిలో 95 మంది ఎన్యూమరేటర్లు కేటాయించిన అధికారులు సోమ, మంగళవారాల్లో హౌస్ లిస్ట్ సర్వే పూర్తి చేశారు. మొత్తం 10 టీమ్‌ల ద్వారా ఒక్కో టీమ్‌కు 9 లేదా 10 బ్లాక్‌లకు ఒక్కో సూపర్‌వైజర్ కేటాయించి సర్వే చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి స్టిక్కర్ వేసి సర్వే కోసం సిద్ధం చేశారు. డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి పర్యవేక్షణలో మండలంలో మొత్తం 16,501 ఇళ్లు ఉన్నట్లు గుర్తించినట్లు ఎంపీడీఓ అశోక్ తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం రూపొందించిన పత్రాలు రాగానే సర్వే ప్రారంభించబడుతుందన్నారు.



సర్వే చేస్తున్న అధికారులు

# మండలానికి 2,500 ఇళ్లు కేటాయించాలి

**తిరుమలాయపాలెం:** ప్రతీ మండలానికి 2,500 ఇళ్లు కేటాయించాలని బీఎస్పీ జిల్లా కోశాధికారి ఎన్నబోయిన రమేష్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆదేశించడం అభినందనీయమన్నారు. కాగా, నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లు సరిపోవని, ప్రతీ మండలానికి 2,500 గృహాలు ఇచ్చి పేదలను ఆదుకోవాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో లబ్ధిదారుల ఎంపిక జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాలేరు అసెంబ్లీ అధ్యక్షుడు మట్టి నాగేశ్వరరావు, పాలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, నల్లగట్టు శంకర్, రాజేంద్ర ప్రసాద్, మట్టి బాలరాజు, పోలే పొంగు శ్రీకాంత్, పోలే పొంగు నాగరాజు, కొమ్ము కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నబోయిన రమేష్

### చెకుముకి పోటీలు

**నేలకొండపల్లి:** మండలంలోని చెరువుమాధారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం చెకుముకి పోటీలు నిర్వహించారు. మొత్తం 124 మంది విద్యార్థులు పాల్గొనగా.. ప్రతిభ కనపరిచిన వారిని మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉజ్వల, అరవిందకుమార్, కల్పవల్లి, వేణు, మంగేశ్వరీ, శ్రీనివాసరావు, ప్రసాద్, రంగయ్య, సత్యనారాయణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

# పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ



పాఠాలు వింటున్న ఎంపీడీఓ, ఎంఈఓ

**నేలకొండపల్లి:** మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆకస్మికంగా ఎంపీడీఓ ఎం.యర్రయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విన్నాక వారితో కలిసి భోజనం చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ సర్పంచ్ దొనకొండ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వడ్డె జగన్ తదితరులు పాల్గొన్నారు.

# డైవర్షన్ ఇంకెన్నాళ్లు..?



ప్రమాదకరంగా ఉన్న గుంత

ఖమ్మం–దోర్నకల్ ప్రధాన లింక్ రోడ్డుగా ఉన్న కోయచలక–పాపటపల్లి రోడ్డులో గత రెండు నెలల క్రితం అకాల వర్షంతో ఆర్‌అండ్‌బీ తారు రోడ్డు కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. దీంతో తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేసి మట్టి వేశారు. కానీ మూడు రోజులకే మళ్లీ వరద రావడంతో వేసిన పైపులు సైతం కొట్టుకుపోయాయి. దీంతో సంబంధిత అధికారులు గుంత పక్కనే శాశ్వత మరమ్మతు చేసేందుకు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే వేగంగా వచ్చిన వాహనదారులు ఇందులో పడి గాయాలపాలవుతున్నారని, తక్షణమే మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు. – రఘునాథపాలెం

# సమస్యల పరిష్కారానికి వినతులు

### కులగణనకు టీచర్లు వద్దు..

**ఖమ్మం మామిళ్లగూడెం:** రాష్ట్ర ప్రభుత్వం కులగణన కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించి ఒక్క పూట బడులు నిర్వహించడం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడానికేనని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. దీనిపై గురువారం డీఈఓ సోమేశ్వరశర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క పూట బడులతో విద్యార్థులకు విద్యాబోధన సరిగా అందక ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రభావం చూపుతుందని మండి పడ్డారు. వినతి అందించిన వారిలో శివనాయక్, వంశీ, రాకేష్, ప్రతాప్, సునిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమామిళ్లగూడెం: డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**డీఎస్సీ అభ్యర్థుల వినతి..**

**ఖమ్మం సహకారనగర్:** డీఎస్సీ–2008లో అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని డీఎస్సీ–2008 సాధన కమిటీ బాధ్యులు డీఈఓ సోమశేఖరశర్మకు గురువారం విన్నవించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో సౌకర్యాలు పెంచాలి..

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో సౌకర్యాలు పెంచాలని వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి సీఐటీయూ అనుబంధ టీజీయూఈఈయూ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ వినతిపత్రాన్ని అందించారు. గురువారం ఖమ్మం విచ్చేసిన సీఎండీని కలిసిన కార్మిక సంఘ నేత ప్రసాద్ సర్కిల్ కార్యాలయంలో పలు గదులు ఇరుకుగా ఉన్నాయని, అదనపు గదులు నిర్మించాలని, సమావేశాలు నిర్వహించుకునేందుకు మీటింగ్ హాల్ నిర్మించాలని వినితి పత్రంలో కోరారు. మధిర, కూసుమంచి, వైరా, తల్లాడల్లో రెవెన్యూ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేవని సంస్థకు స్థలాలు ఉన్న చోట సొంత భవనాలు నిర్మించాలని, విద్యుత్ సంస్థ భూములకు, స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జూనియర్ లైన్‌మెన్లు, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయాలని, ఆర్టిజన్లను కన్వెర్షన్ చేయాలని, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని మరో వినతి పత్రాన్ని అందజేశారు.

### సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయండి

**తిరుమలాయపాలెం:** ఖమ్మం రోటరీనగర్ పాఠశాలలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు నిర్వహించే తెలంగాణ దివ్యాంగ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ కోరారు. గురువారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో దివ్యాంగ ఉద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి దివ్యాంగ ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### ఏఐఎస్‌ఎఫ్ కృషితోనే కాస్మోటిక్ చార్జీల పెంపు

**ఖమ్మంరూరల్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి బూర మనోజ్ తెలిపారు. గురువారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఏ మాత్రం కూడా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లేదంటే భవిష్యత్‌లో విద్యార్థుల తరఫున పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

# ప్రజల పక్షాన ఐక్యంగా పోరాడుదాం

**కామేపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాలపై ఐక్యంగా పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని మద్దులపల్లి గ్రామంలో యింజం నాగభూషణం అధ్యక్షతన సీపీఎం 9వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ప్రజా సమస్యల కోసం పోరాడేది కేవలం సీపీఎం కార్యకర్తలేనని, ప్రతీ కార్యకర్త ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటారని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించుకుని గ్రామాభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శిగా అంబటి శ్రీనివాసరెడ్డి, సభ్యులుగా ఆరెం లక్ష్మి, బాదావత్ శ్రీను, లావుడియా రామా, వినుకొండ నాగేశ్వరరావు, రాయల సత్యనారాయణ, ఉప్పెర సూర్యనారాయణ, కృష్ణమూర్తి, కిన్నెర రామచంద్రయ్య, రాంబాబు, హుస్సేన్, అండపా ఉపేందర్‌ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, కృష్ణ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

# ఈ ఏడాది నిరాశే..!



పండితాపురంలో పత్తి పంటను దున్నిస్తున్న రైతు

**ప్రకృతి ప్రకోపానికి పత్తి రైతు చిత్తు**

- దిగుబడి, ధరపై ఆశలు ఆవిరి
- పెట్టుబడి కూడా వచ్చేలా లేని వైనం
- మండలంలో సుమారుగా 11 వేల ఎకరాల్లో సాగు
- పత్తి తొలగించి ఆపరాల సాగుకు సిద్ధం

**కామేపల్లి:** ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. పత్తి పంటను సాగు చేసిన నాటి నుంచి అధిక వర్షాలు కురవడంతో పూత కాత సరిగా రాలేదు. పత్తి మొక్కల ఎదుగుదల ఆగిపోగా, ఎదిగిన పత్తిలో కాయలు కుళ్లిపోయాయి. పండిన పంటకు కూడా మార్కెట్‌లో సరైన ధర లేదు. ఇలా అన్ని విధాలా దెబ్బ మీద దెబ్బ తగుతుండడం, సాగూ ఆశాజనకంగా లేకపోవడంతో వచ్చే రాబడిని రైతులు ఆశలు వదులుకున్నారు. పత్తి సాగుకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టినా కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనబడడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.



పత్తితీత పనుల్లో కూలీలు

**అడుగంటిన ఆశలు..**

పత్తి సాగు చేసిన రైతులు ప్రతి ఏటా ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. పూత, కాత దశ వరకు ఆశాజనకంగా ఉన్న పత్తి పంట తర్వాత కురిసిన వర్షానికి పూత రాలిపోగా కాసిన కాయలు కుళ్లిపోయాయి. దీంతో ఎకరాకు 10 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చే పరిస్థితులు నెలకొంది. ప్రస్తుతం పత్తి ఎర్రబారడంతో పత్తి పంటపై ఆశలు ఆవిరైనవి. కూలీల సమస్య కారణంగా పత్తిని తీసేందుకు కూడా కూలీలకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. మార్కెట్‌లో కూడా క్వింటా పత్తి రూ.7 వేల లోపే కొనుగోలు చేస్తుండడంతో రైతులకు మరింత ఎదురుదెబ్బ తగిలింది. ఇలాంటి పరిస్థితి పత్తి సాగు చేసిన రైతులకు ఎన్నడూ ఎదురుకాలేదు.

**ఎకరాకు సుమారు రూ.50వేలు..**

మండలంలో సుమారుగా 11 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఒక్కో ఎకరానికి రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టగా ఎకరాకు ఆరు నుంచి తొమ్మిది క్వింటాళ్ల పత్తి దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు అంటున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో ఆపరాల సాగు చేసేందుకు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. దీంతో రబీలో ఆపరాల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. మార్కెట్‌లో కూడా ఆపరాలకు మంచి డిమాండ్‌తో పాటు ధర ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

**11 వేల ఎకరాల్లో సాగు..**



మండలంలో సుమారుగా 11 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో పెసర, మినుము, బొబ్బెర, జొన్న, మొక్కజొన్న వంటి అపరాల సాగు చేయనున్నారు.

– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి

**పత్తితీత కాగానే దున్నిస్తా..**



ఈ ఏడాది పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు.పత్తి తీత కాగానే దున్ని ఆపరాలను సాగు చేస్తాను.మార్కెట్‌లో ఆపరాలకు మంచి డిమాండ్, ధర ఉండడంతో ఆపరాల పంటను సాగు చేయాలని అనుకుంటున్నా.

– జర్పుల రామారావు, రైతు, రామకృష్ణాపురం

**పత్తిని తొలగించా..**



రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశా. పత్తి పూత,కాత దశ వరకు ఆశాజనకంగా ఉన్నా ఆ తర్వాత కురిసిన వర్షానికి ఎర్ర బారి పూత రాలిపోయింది. దీంతో దిగుబడి తగ్గగా పత్తిని దున్ని ఆపరాలు సాగు చేసేందుకు దుక్కిన్ని సిద్ధం చేస్తున్నా.

– బొగ్గారపు అశోక్, రైతు, పండితాపురం